ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 104 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 3 ✦https:www.prajarepublic.com ✦ వెల - 1/- | సోమవారం 18 నవంబర్ 2024
RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# తితిదే పాలక మండలి భేటీ.. 80 అంశాల అజెండాపై చర్చ

**తితిదే నూతన పాలక మండలి సమావేశం కొనసాగుతోంది.**

తిరుమల, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): తితిదే నూతన పాలక మండలి సమావేశం కొనసాగుతోంది. తిరుమలలోని అన్నమయ్య భవన్లో చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన జరుగుతున్న సమావేశంలో 80 అంశాలతో కూడిన అజెండాపై సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. వైకాపా పాలనలో సామాన్య భక్తులకు ఎదురైన ఇబ్బందులను తొలగించడంపై పాలకమండలి దృష్టిసారించింది. వైకుంఠం క్యూకాంప్లెక్సు అందుబాటులోకి తేవడంపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశముంది. తిరుమలలో అన్యమత ప్రచారం జరగకుండా కఠిన చర్యలు చేపట్టే అంశంపైనా చర్చిస్తున్నట్లు సమాచారం.



స్వామివారి నైవేద్యాలు, లడ్డూ ప్రసాదాలు, అన్న వితరణ కేంద్రంలో వినియోగించే ఉత్పత్తుల నాణ్యత పెంచడంపై చర్చించే అవకాశముంది. భక్తులకు కేటాయించే వసతి గృహాల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై సమావేశంలో చర్చ జరుగుతున్నట్లు తెలిసింది.

# కోమా వార్తల నేపథ్యంలో బయటికొచ్చిన ఖమేనీ

**పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ.. ప్రతి పరిణామమూ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. ఈక్రమంలో ఇరాన్ సుప్రీం లీడర్ ఎక్స్ వేదికగా ఒక పోస్టు పెట్టారు.**

ఇరాన్ సర్వోన్నత నేత అయతుల్లా అలీ ఖమేనీ కోమాలో ఉన్నట్లుగా వచ్చిన వార్తల నేపథ్యంలో ఓ ఫొటో బయటకు వచ్చింది. స్వయంగా ఖమేనీనే ఎక్స్ వేదికగా ఆ ఫొటోను పోస్టు చేశారు. తాను లెబనాన్ లో ఇరాన్ రాయబారి మొజాబా అమనితో భేటీ అయినట్లు పర్షియన్ భాషలో రాసుకొచ్చారు.ఇదీ చదవండి:బ్రిటన్ రాజభవనంలో దొంగలు పడ్డారు..!ఖమేనీ తీవ్ర అనారోగ్యంతో ఉన్నారని అక్టోబర్లో న్యూయార్క్ టైమ్స్ కథనం వెల్లడించింది. అప్పటినుంచి ఈ 85 ఏళ్ల సుప్రీం లీడర్ కోమాలోకి వెళ్లిపోయారంటూ పలు మీడియా కథనాలు రాసుకొచ్చాయి. ఒక రహస్య సమావేశంలో ఆయన కుమారుడు మోజాబా ఖమేనీని తన వారసుడిగా నామినేట్ చేసినట్లు పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే ఎక్స్ వేదికగా స్పందించిన ఖమేనీ.. రాయబారి అమనితో మాట్లాడుతున్న చిత్రాన్ని షేర్ చేశారు. ఇజ్రాయెల్ గతంలో జరిపిన పేజర్ పేలుళ్లలో అమని గాయపడ్డారు. ఆసందర్భంగా తన ఆరోగ్య పరిస్థితిని రాయబారి వివరించారు.పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ కొన్ని నెలల క్రితం లెబనాన్, సిరియాలపై అనూహ్య దాడి జరిగి వేలాది పేజర్లు, వాకీటాకీలు పేలిపోయిన సంగతి తెలిసిందే. రోజుల వ్యవధిలో జరిగిన ఆ ఘటనల్లో పదుల సంఖ్యలో ప్రాణనష్టం జరగ్గా.. సుమారు 3వేల మంది గాయపడ్డారు. అందులో లెబనాన్లోని ఇరాన్ రాయబారితోపాటు హెజ్బొల్లా కీలక నేతలున్నారు. తర్వాత ఆ పేజర్ దాడుల ఆపరేషన్కు తానే 'గ్రీన్ సిగ్నల్' ఇచ్చినట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అంగీకరించిన సంగతి తెలిసిందే.

# అతడికి క్షమాభిక్ష ప్రసాదిస్తారా?

## 2 వారాల్లో తెలియజేయండి: రాష్ట్రపతిని కోరిన సుప్రీం

**మరణశిక్ష ఎదుర్కొంటున్న బల్వంత్ సింగ్ రాజోనా క్షమాభిక్ష అభ్యర్థనపై రెండు వారాల్లో తమ నిర్ణయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు రాష్ట్రపతిని కోరింది.**



దిల్లీ: నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ హత్య కేసులో మరణశిక్ష పడిన బల్వంత్ ఉత్తర్వులు వెలువరించింది. అతడి పిటిషన్ ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దృష్టికి తీసుకెళ్లాలని ఆమె కార్యదర్శిని ఆదేశించింది. దీనిపై రెండు వారాల్లోగా నిర్ణయం తెలియజేయాలని సుప్రీం ధర్మాసనం రాష్ట్రపతిని అభ్యర్థించింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను డిసెంబరు 3వ తేదీకి వాయిదా వేసింది.సిక్కులకు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతూ జరుగుతున్న ఆందోళనల్లో భాగంగా 1995లో చండీగఢ్ సచివాలయం ముందు జరిగిన పేలుడులో అప్పటి పంజాబ్ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ తో పాటు మరో 16 మంది మరణించారు. ఈ పేలుడులో కానిస్టేబుల్గా పనిచేస్తున్న బల్వంత్ సింగ్ రాజోనా ప్రమేయం ఉన్నట్లు రుజువు కావడంతో 2007లో అతడికి ప్రత్యేక న్యాయస్థానం మరణశిక్ష విధించింది. గత రెండు దశాబ్దాలకు పైగా రాజోనా జైలు శిక్ష అనుభవిస్తున్నాడు.తనకు క్షమాభిక్ష ప్రసాదించాలని కోరుతూ 2012లో రాజోనా కేంద్రాన్ని ఆశ్రయించాడు. అప్పటినుంచి అతడి పిటిషన్ పెండింగ్లోనే ఉంది. ఈ క్రమంలోనే తన మరణశిక్షను జీవితఖైదుకు తగ్గించాలని కోరుతూ 2020లో రాజోనా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. మరణశిక్షను జీవితఖైదుగా మార్చలేమని గతేడాది మే నెలలో తేల్చిచెప్పింది. అయితే, అతడి క్షమాభిక్ష పిటిషన్ పై నిర్ణయం తీసుకోవాలని కేంద్ర హోంశాఖను ఆదేశించింది.

# కనకదాస బోధనలు నేటికీ అనుసరణీయం

## : సీఎం చంద్రబాబు

**సంఘ సంస్కర్త, కవి, గాయకుడు, కృష్ణతత్వ భక్తుడు గురు కనకదాస జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.**



అమరావతి, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): సంఘ సంస్కర్త, కవి, గాయకుడు, కృష్ణతత్వ భక్తుడు గురు కనకదాస జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో మార్పు తీసుకొచ్చేందుకు ఆయన చేసిన కృషి మరవలేనిదన్నారు. కర్ణాటకలో జన్మించిన గురు కనకదాస రాయలసీమలోనూ కుల వ్యవస్థ, అసమానతలపై చైతన్యం తీసుకొచ్చిన సామాజిక తత్వవేత్త అని కొనియాడారు. బీసీలు, వారి సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ, వారి ఉన్నతి కోసం ప్రతి ఒక్కరూ పని చేయాల్సిన అవసరం గుర్తు చేసిన మహనీయుడు కనకదాస.. అని వెల్లడించారు. భక్తి మార్గంలో ఆయన చేసిన బోధనలు నేటికీ అనుసరణీయమన్నారు. ప్రజలకు అర్థమయ్యే రీతిలో సరళమైన భాషలో ఆయన ఎన్నో ఏళ్ల కిందట చేసిన బోధనలు ఈనాటి సమాజానికి కూడా మార్గదర్శనం చేస్తున్నాయంటే ఆ మహనీయుడి దార్శనికతను మనం అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. గురు కనకదాస బోధనలు సమాజాన్ని సక్రమ మార్గంలో నడిపించేందుకు ఉపకరిస్తాయని తాను మనస్ఫూర్తిగా నమ్ముతున్నానన్నారు. అందుకే కనకదాస జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని సీఎం చెప్పారు.

# కేసీఆర్, రేవంత్ రెడ్డి నైతిక విలువలు వదిలేశారు: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**భారాస, కాంగ్రెస్ పార్టీలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్రెడ్డివిమర్శించారు.**




హైదరాబాద్, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్రంలో భారాస, కాంగ్రెస్ పార్టీలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. గతంలో భారాస ప్రభుత్వం ఎలా ఉందో.. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు కూడా అలాగే ఉందన్నారు. అదే రకమైన అవినీతి, గాలి మాటలు విని ప్రజలు విసిగిపోతున్నారన్నారు. కేసీఆర్ రేవంత్ రెడ్డి రాజకీయాల్లో నైతిక విలువలు వదిలేశారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల మేర అప్పులు చేశారన్నారు. రేవంత్ ఏకంగా అప్పుల కోసం ఒక టాస్క్ఫోర్స్ ఏర్పాటు చేశారని మండిపడ్డారు. "రైతు భరోసా, రుణమాఫీ లేదు. పింఛన్లు పెంచుతామన్నారు.. ఒక్క రూపాయి పెంచలేదు, కొత్త పింఛన్లు ఇవ్వలేదు. రేవంత్రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారు. హామీలన్నీ ఆయన గాలికొదిలేశారు. పైగా మహారాష్ట్రలో నిర్వహిస్తున్న ప్రచారంలో తెలంగాణ సస్యశ్యామలం అయిందంటూ మాట్లాడుతున్నారు. ఇంతకంటే అబద్ధాలు ఉంటాయా? కాంగ్రెస్, భారాస తమ వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. భాజపా నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని భాజపా పోలింగ్ బూత్ కమిటీల నియామకం చేపట్టాలి. మళ్లీ మండల స్థాయి వర్క్షాపులు ఉంటాయి. ఈ నెల 22న దిల్లీలో జరగనున్న పార్టీ సంస్థాగత సమావేశాల్లో మండల, జిల్లా ఎన్నికల తేదీలు వస్తాయి. తెలంగాణలో పనిచేయడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదు. దేశంలో కాంగ్రెస్ పార్టీ మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉండి భ్రష్టు పట్టించింది" అని కిషన్రెడ్డి విమర్శించారు.

# ఇమామ్లు, మౌజమ్లకు గౌరవ వేతనం కొనసాగిస్తాం

## : ఏపీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

**ఇమామ్లు, మౌజమ్లకు గౌరవ వేతనం ఇవ్వడాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని ఏపీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్**



అమరావ నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): ఇమామ్లు, మౌజమ్లకు గౌరవ వేతనం ఇవ్వడాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని ఏపీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో ఈ మేరకు ఆయన వెల్లడించారు. పలువురు ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఇమామ్, మౌజమ్లకు గౌరవ వేతనం తెదేపా ప్రభుత్వమే ప్రారంభించిందని గుర్తుచేశారు. ముస్లింలు హజ్ యాత్రకు వెళ్తే ఇచ్చే ఆర్థిక సాయాన్ని కొనసాగిస్తామన్నారు. గతంలో యాత్రకు వెళ్లి వచ్చినవారికి ఇవ్వాల్సిన పెండింగ్ నిధులను మంజూరు చేస్తామని చెప్పారు. విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికే రూ. లక్ష అందజేస్తామని ఫరూక్ తెలిపారు.


# వారం కిందట అదృశ్యమై.. తుక్కుగూడలో శవమై కనిపించి..

**నగరంలోని మియాపూర్లో అదృశ్యమైన అమ్మాయి (17) మృతదేహం లభ్యమైంది.**

హైదరాబాద్, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): నగరంలోని మియాపూర్లో అదృశ్యమైన అమ్మాయి (17) మృతదేహం లభ్యమైంది. తుక్కుగూడలోని ప్లాస్టిక్ పరిశ్రమ వద్ద మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. నవంబర్ 10న అమ్మాయి కనిపించడం లేదంటూ ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సోమవారం మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలికి ఉప్పుగూడకు చెందిన ఓ యువకుడితో సోషల్ మీడియా ప్లాట్ఫామ్ ఇన్స్టాగ్రామ్లో పరిచయం ఏర్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇన్స్టాలో పరిచయం అయిన ఆ యువకుడే హత్య చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

# రామ్ గోపాల్ వర్మకు ఏపీ హైకోర్టులో చుక్కెదురు

**అరెస్టు నుంచి తనకు రక్షణ కల్పించాలన్న సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ (ఆర్జీవీ) అభ్యర్థనను ఏపీ హైకోర్టు తోసిపుచ్చింది.**



అమరావతి, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): అరెస్టు నుంచి తనకు రక్షణ కల్పించాలన్న సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ(ఆర్జీవీ) అభ్యర్థనను ఏపీ హైకోర్టు తోసిపుచ్చింది. అరెస్టుపై ఆందోళన ఉంటే బెయిల్ పిటిషన్ వేసుకోవాలని స్పష్టం చేసింది. పోలీసుల విచారణకు మరికొంత సమయమివ్వాలని ఆర్జీవీ విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఉన్నత న్యాయస్థానం.. అభ్యర్థన పోలీసుల ముందు చేసుకోవాలని, కోర్టు ముందు కాదని వ్యాఖ్యానించింది గతంలో వ్యూహం సినిమా విడుదల సమయంలో చంద్రబాబు, పవన్ వ్యక్తిత్వాలను కించపరిచేలా ఆర్జీవీ పోస్టులు పెట్టారు. దీనిపై తెదేపా మద్దిపాడు మండల ప్రధాన కార్యదర్శి రామలింగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈక్రమంలో కేసును కొట్టివేయాలని వర్మ పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా విచారణ జరిపిన న్యాయస్థానం ఫిర్యాదుదారుడికి నోటీసులు జారీ చేసింది.

# ప్రధాని వ్యాఖ్యలను ఖండించిన రాహుల్ గాంధీ

**ప్రధాని మోదీ ఇచ్చిన 'సేఫ్' నినాదాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు.**



దిల్లీ, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): ప్రధాని నరేంద్రమోదీ కాంగ్రెస్పై తీవ్ర విమర్శలు చేయడంపై ఆ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. మోదీ ఇచ్చిన 'సేఫ్' నినాదాన్ని ఖండించారు. ముంబయిలో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రధానిపై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొన్న ప్రధాని కాంగ్రెస్పై తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. 'ఏక్ హై తో సేఫ్ హై' (ఐక్యంగా ఉంటేనే మనమంతా సురక్షితంగా ఉంటాం) అని ప్రజలకు పిలుపునిచ్చారు. దీనిపై రాహుల్ గాంధీ స్పందిస్తూ.. "పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసమే మోదీ సర్కార్ పని చేస్తోంది. పేదల గురించి వారికి ఎలాంటి ఆలోచన లేదు. ధారావిలోని నివాసితుల ప్రయోజనాలను విస్మరించారు. మహారాష్ట్రలో ఎంవీఏ కూటమి అధికారంలోకి వచ్చాక అక్కడి ప్రజలకు భూములను తిరిగి అప్పగిస్తుంది" అని రాహుల్ హామీ ఇచ్చారు. ఇదీ చదవండి: "నిన్న ఆన్ఆద్మీకి గుడ్బై.. నేడు భాజపాలో చేరిన కైలాశ్ గహ్లోత్" ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే వారికే ప్రాజెక్టులను అప్పగించాలంటూ కేంద్ర ఏజెన్సీలు పారిశ్రామికవేత్తలపై ఒత్తిడి తీసుకొస్తున్నాయని కాంగ్రెస్ నేత ఆరోపించారు. "ప్రధాని ఇచ్చిన సేఫ్ నినాదంపై ఒక సందేహం ఉంది. ఐక్యంగా ఉంటేనే సురక్షితం అన్నారు. ఇక్కడ ఎవరి సురక్షితంగా ఆయన మాట్లాడారు" అని ప్రశ్నించారు. ధారావిలో రీడెవలప్మెంట్ ప్రాజెక్ట్ టెండర్ల ప్రక్రియ కొందరి ప్రయోజనల కోసమే రూపొందించారు అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# పోసాని కృష్ణ మురళిపై ఏపీ సీఐడీ కేసు

**సినీనటుడు పోసాని కృష్ణమురళి పై ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది.**



అమరావతి, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): సినీనటుడు పోసాని కృష్ణమురళి పై ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. రాష్ట్ర తెలుగు యువత ప్రతినిధి బండారు వంశీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. సెప్టెంబర్లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు పై పోసాని అసత్య ప్రచారం, అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వంశీకృష్ణ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు సీఎం వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఉన్నాయన్నారు. వర్గాల మధ్య విభేదాలు తలెత్తేలా మాట్లాడిన పోసానిపై చర్యలు తీసుకోవాలని సీఐడీని కోరారు. దీంతో సీఐడీ అధికారులు పోసాని కృష్ణ మురళిపై కేసు నమోదు చేశారు.

## వేములవాడ అభివృద్ధికి రూ.127.65 కోట్లు మంజూరు

**వేములవాడలో అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.127.65 కోట్లు మంజూరు చేసింది.**



హైదరాబాద్, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): వేములవాడలో అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.127.65 కోట్లు మంజూరు చేసింది. శ్రీరాజరాజేశ్వర ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, భక్తుల సదుపాయాలకు రూ.76 కోట్లు కేటాయించింది. వేములవాడ ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్ల విస్తరణ చేపట్టనున్నారు. ఇందుకు అవసరమైన భూసేకరణకు ప్రభుత్వం రూ.47.85 కోట్లు మంజూరు చేసింది. బతుకమ్మ తెప్ప నుంచి జగిత్యాల వరకు డ్రైనేజీ నిర్మాణానికి రూ.3.8 కోట్లు కేటాయించింది.

## హైదరాబాద్లోని పలు ప్రాంతాల్లో ఐటీ సోదాలు




హైదరాబాద్, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): నగరంలోని పలు ప్రాంతాల్లో ఐటీ సోదాలు చేశారు. షాద్నగర్లోని స్వస్తిక్ గ్రూప్ కంపెనీలు, స్థిరాస్తి సంస్థల్లో తనిఖీలు చేశారు. బేగం బజార్, బంజారాహిల్స్, షాద్నగర్ సహా మరో రెండు చోట్ల సోదాలు జరిగాయి. ఉదయం నుంచి ఐటీ అధికారులు ( బృందాలుగా విడిపోయి ఇందులో పాల్గొన్నారు.

## సువర్ణ భూమి ఇన్ఫ్రా డెవలపర్స్ ఎండీపై ఫిర్యాదు

**సువర్ణ భూమి ఇన్ఫ్రా డెవలపర్స్ ఎండీ శ్రీధర్పై హైదరాబాద్ సీసీఎస్ విశ్రాంత ఉద్యోగులు ఫిర్యాదు చేశారు.**




హైదరాబాద్, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): సువర్ణ భూమి ఇన్ఫ్రా డెవలపర్స్ ఎండీ శ్రీధర్పై హైదరాబాద్ సీసీఎస్లో విశ్రాంత ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. పెట్టుబడి పేరుతో మోసగించారని సాఫ్ట్వేర్, విశ్రాంత ఉద్యోగులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బై బ్యాక్ ఇన్వెస్ట్మెంట్ పేరిట దాదాపు రూ.కోటి మేర వసూలు చేశారని.. ఏడాదిన్నర తర్వాత 25 శాతం అధికంగా చెల్లిస్తామని తెలిపారని బాధితులు చెప్పారు. స్కీమ్ కాలవ్యవధి దాటినా డబ్బులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎలాగైనా తమకు న్యాయం చేయాలని బాధితులు ఫిర్యాదులో కోరారు.

## విజయనగరం భూముల అక్రమాలపై విచారణ చేపట్టండి: బొత్స

**విజయనగరంలో భూముల అక్రమాలపై విచారణ చేపట్టాలంటూ సీఎం చంద్రబాబుకు మండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ లేఖ రాశారు.**



అమరావతి, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): విజయనగరంలో భూముల అక్రమాలపై విచారణ చేపట్టాలంటూ సీఎం చంద్రబాబుకు మండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ లేఖ రాశారు. విజయనగరంలో భూములు కొట్టేశారంటూ 'ఈనాడు'లో వచ్చిన కథనాన్ని లేఖలో ప్రస్తావించారు. ఆరోపణలున్న అధికారులు, ప్రజాప్రతినిధులపై విచారణ జరపాలని కోరారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్కు కూడా ఇదే లేఖ పంపించారు.

## ఏడు కీలక బిల్లులకు ఏపీ శాసనసభ ఆమోదం

**ఏపీ పంచాయతీరాజ్ సవరణ బిల్లు -2024, ఏపీ మున్సిపల్ సవరణ బిల్లు -2024, ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ నిరోధక బిల్లు-2024 తదితర ఏడు కీలక బిల్లులకు ఏపీ శాసనసభ ఆమోదం తెలిపింది**




అమరావతి, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): ఏపీ పంచాయతీరాజ్ సవరణ బిల్లు-2024, ఏపీ మున్సిపల్ సవరణ బిల్లు-2024, ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ నిరోధక బిల్లు-2024 తదితర ఏడు కీలక బిల్లులకు ఏపీ శా-సనసభ ఆమోదం తెలిపింది. ఎంతమంది పిల్లలున్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించేలా నిబంధనలు మా-రుస్తూ తీసుకొచ్చిన బిల్లు సభ ఆమోదం పొందింది. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ సవరణ బిల్లు-2024, ఆయుర్వేదిక్ హోమియోపతి మెడికల్ ప్రాక్టీషనర్స్ చట్ట సవరణ, ఏపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ చట్ట సవరణ బిల్లు-2024 బిల్లులను శాసనసభ ఆమోదించింది. వీటితోపాటు ఏపీ సహకార సంఘం సవరణ బిల్లు-2024నూ శాసనసభ ఆమోదించింది. అనంతరం స్పీకర్ అయ్యన్న పాత్రుడు శాసనసభను మంగళవారానికి వాయిదా వేశారు.

## తప్పుడు నివేదికలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి : స్పీకర్ అయ్యన్న

**జగనన్న కాలనీల్లో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు**



అమరావతి, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): జగనన్న కాలనీల్లో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు గృహనిర్మాణశాఖపై మాట్లాడారు. తెదేపా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ విశాఖపట్నంలో అక్రమాలు జరిగాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం స్పీకర్ అయ్యన్న స్పందిస్తూ అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలన్నారు. అధికారులు ఇచ్చే నివేదికలకు, వాస్తవ పరిస్థితులకు చాలా తేడా ఉంటోందన్నారు. తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని.. అలా చేస్తే మిగిలిన వారు తప్పులు చేయరన్నారు. ఈ మేరకు మంత్రి పార్థసారథికి స్పీకర్ సూచించారు.

## తెలంగాణ సచివాలయంలో వాస్తు మార్పులు

**రాష్ట్ర సచివాలయంలో స్వల్ప వాస్తు మార్పులు జరుగుతున్నాయి. తూర్పు వైపు ఉన్న ప్రధాన ద్వారాన్ని (బాహుబలి ద్వారం) మూసివేస్తున్నారు.**




నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్ర సచివాలయంలో స్వల్ప వాస్తు మార్పులు జరుగుతున్నాయి. తూర్పు వైపు ఉన్న ప్రధాన ద్వారాన్ని(బాహుబలి ద్వారం) మూసివేస్తున్నారు. ఇందులో భాగంగా తలుపులు తీసేసి ఆ ప్రాంతంలో రేకులు ఉంచారు. ఈశాన్యం గేటుకు తూర్పు వైపున ప్రధాన ద్వారం రానుంది. ఇక్కడ మరో గేటును ఏర్పాటు చేస్తారు. మిగతా గేట్లను యథావిధిగా ఉంచనున్నారు. డిసెంబరు 9న తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ ఉండడంతో ఆ లోపు వాస్తు మార్పులు పూర్తిచేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

## వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్ల ప్రసక్తే లేదు: మంత్రి గొట్టిపాటి

**వైకాపా హయాంలో విద్యుత్శాఖలో రూ.1.29 లక్షల కోట్ల అప్పులు చేసిందని ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు.**



అమరావతి, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): వైకాపా హయాంలో విద్యుత్శాఖలో రూ.1.29లక్షల కోట్ల అప్పులు చేసిందని ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. పీపీఏలు రద్దు చేయవద్దని కేంద్ర ప్రభుత్వం చెప్పినా వైకాపా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని.. దీని వల్ల పెట్టుబడులు వెనక్కి వెళ్తాయన్నా వినలేదని చెపా-ఎరు. శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ మాట్లాడారు. విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వ్యవసాయం కోసం వినియోగించే మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రసక్తే లేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

## నమస్కారం పెడదామన్నా జగన్ అసెంబ్లీకి రావడం లేదు: కోటంరెడ్డి

**రోజూ ఓ గంట సమయం మాట్లాడే అవకాశం కల్పిస్తామని జగన్ కు లిఖిత పూర్వకంగా హామీ ఇస్తే అసెంబ్లీకి వస్తారేమోనని తెదేపా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి ఎద్దేవా చేశారు.**



అమరావతి, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్: రోజూ ఓ గంట సమయం మాట్లాడే అవకాశం కల్పిస్తామని జగన్ కు లిఖిత పూర్వకంగా హామీ ఇస్తే అసెంబ్లీకి వస్తారేమోనని తెదేపా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి ఎద్దేవా చేశారు. ఓ నమస్కారం పెట్టాలని చూస్తున్నా ఆయన రావడం లేదని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులతో ఆయన చిట్చాట్ నిర్వహించారు. వైకాపాలో జగన్ మినహా ఎవరూ మాట్లాడేందుకు వీల్లేదనే మనస్తత్వం జగనని శ్రీధర్రెడ్డి విమర్శించారు. ఆయన అసెంబ్లీలో ఎప్పుడు గొడవ పడినా మైక్ కోసమే తప్ప ప్రజాసమస్యల కోసం కాదన్నారు. తమతోనూ గొడవ చేయించేవారన్నారు.

## దిశ చట్టం పనిచేస్తే అఘాయిత్యాలు ఎందుకు పెరిగాయ్? : హోం మంత్రి అనిత

**గతంలో మహిళలపై అత్యాచారాలు జరిగితే జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని హోం మంత్రి అనిత విమర్శించారు.**



అమరావతి, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): గతంలో మహిళలపై అత్యాచారాలు జరిగితే జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని హోం మంత్రి అనిత విమర్శించారు. ఐదో రోజు శాసనమండలి సమావేశాల్లో ఆమె మాట్లాడారు. ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. "వైకాపా హయాంలో పరామర్శకు వెళ్లిన మాపైనే కేసులు పెట్టారు. దిశ చట్టం గురించి గొప్పగా చెబుతున్నారు.. అసలు ఆ చట్టం ఉందా? దిశ యాప్, చట్టం పని చేస్తే మహిళలపై అఘాయిత్యాలు ఎందుకు పెరిగాయి. ఉన్న నిర్భ-య చట్టాన్ని వదిలేసి.. లేని దిశ చట్టాన్ని తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వ హయాంలో మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన వారిని అరె-స్టు చేస్తున్నాం. ముచ్చుమర్రి ఘటనలో బాలికను గుర్తించడానికి సమయం పట్టింది. పోలీసుల వైఫల్యం ఇప్పటిది కాదు.. వైకాపా హయాం నాటిది. కూటమి ప్రభుత్వంలో పోలీసులు 24 నుంచి 48 గంటల్లో నేరస్థుల్ని పట్టుకుంటున్నారు. గత ఐదేళ్లలో పోలీసులు పరదాలు కట్టడానికి, చెట్లు నరకడానికి, రోడ్ల మీద కాపలా కాయడానికి పని చేశారు. ఒక్క మహిళనైనా వారు రక్షించారా? దిశ చట్టానికి చట్టబద్ధత లేకుండా దిశ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరంలో దిశ పోలీసు స్టేషన్ ప్రారంభించారు. అదే రోజు దళిత మహిళపై సామూహిక అత్యాచారం చేసి పోలీసు స్టేషన్ ముందు వదిలేసి వెళ్లారు. దిశ యాప్తో నేరాలు తగ్గింది నిజమైతే.. రికార్డుల్లో ఎందుకు నేరాలు పెరుగుతున్నాయి. అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబ్ కట్టడానికి వైకాపా హయాంలో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అది పూర్తయి ఉంటే నేరాలు జరిగిన వెంటనే శిక్షలు పడేందుకు అవకాశం ఉండేది. 2014-19 మధ్య ఏపీలో 83,202 కేసులు నమోదయ్యాయి. 2019-24 మధ్య 1,00,508 కేసులు నమోదయ్యాయి. గడిచిన ఐదేళ్లలో మహిళలపై అఘాయిత్యాలు 20.8 శాతం పెరిగాయి. గత ప్రభుత్వం దిశ చట్టాన్ని తెచ్చి అమలు చేయడంలో విఫలమైంది. జగన్ పాలనలో అనేక అఘాయిత్యాలు జరిగినా కనీస చర్యల్లేవు. మహిళా పోలీసు స్టేషన్ల బోర్డులను దిశ పీఎస్ లుగా మార్చారు. గంజాయి నియంత్రణపై జగన్ ఒక్కసారి కూడా సమీక్షించలేదు. మహిళల భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రత్యేక కోర్టులతో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చేస్తున్నాం. జగన్ తల్లి, చెల్లికి అన్యాయం జరిగినా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మహిళల జోలికొచ్చినా, సోషల్మీడియాలో అసభ్యకరంగా మాట్లాడినా కఠిన చర్యలు తీసుకుంటాం. మహిళా పీఎస్ లు, హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసి నివారణ చర్యలు తీసుకుంటున్నాం. 5 నెలల కాలంలో 24 గంటల్లోనే నిందితులను పట్టుకుని రిమాండ్కు పంపించాం. మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా కఠిన చట్టాలు, ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తాం" అని అనిత

## వైకాపా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పై కేసు నమోదైంది.



టెక్కలి, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): వైకాపా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పై కేసు నమోదైంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్పై అసభ్యకర వ్యాఖ్యలు చేశారంటూ టెక్కలి నియోజకవర్గ జనసేన నాయకుడు కణితి కిరణ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో టెక్కలి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు.

## విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం .. పరామర్శించిన కన్నా లక్ష్మీనారాయణ

**సత్తెనపల్లి ఎస్సీ హాస్టల్లో ఆత్మహత్యాయత్నం చేసిన ఇద్దరు విద్యార్థినులను తెదేపా నేత, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పరామర్శించారు.**



గుంటూరు, నవంబర్, 18 (రిపబ్లిక్ న్యూస్): సత్తెనపల్లి ఎస్సీ హాస్టల్లో ఆత్మహత్యాయత్నం చేసిన ఇద్దరు విద్యార్థినులను తెదేపా నేత, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పరామర్శించారు. గుంటూరు జీజీహెచ్లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని గురించి ఆరా తీశారు. హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం కారణంగానే వారు ఆత్మహత్యకు యత్నించినట్లు చెప్పారు. వార్డెన్ రాణి వేధింపుల వల్లే ఆత్మహత్యకు యత్నించినట్లు విద్యార్థినులు చెబుతున్నారని.. భోజనం బాగోలేదని ఫిర్యాదు ఇచ్చినందుకు ఏదో ఒక వంకతో ఆమె ఇబ్బందులు పెడుతున్నారని వారు తన ఎదుట వాపోయారన్నారు. వార్డెన్ తీరుపై రెండు రోజుల క్రితమే విద్యార్థినుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారని చెప్పారు. వార్డెన్పై కఠిన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తానన్నారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు తెలిపారు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- భారత సరిహద్దు సైన్య దినోత్సవం.
- **1493** : క్రిస్టోఫర్ కొలంబస్ మొట్టమొదట పొర్తొరీకో దీవిని కనుగొన్నాడు.
- **1901** : భారతీయ సినిమా రంగంలో చిత్రనిర్మాత, దర్శకుడు, నటుడు వి. శాంతారాం జననం (మ.1990).
- **1945** : శ్రీలంక ఆరవ అధ్యక్షుడు మహీంద రాజపక్స జననం.
- **1962** : హైడ్రోజన్ పరమాణు వ్యాసార్థాన్ని కనుగొన్న ప్రముఖ శాస్త్రవేత్త నోబెల్ బహుమతి గ్రహీత నీల్స్ బోర్ మరణం (జ.1885). (చిత్రంలో)
- **1963** : మొట్టమొదట పుష్ బటన్ టెలిఫోన్ సేవలు ప్రారంభమైనాయి.
- **1972** : భారత జాతీయ జంతువుగా పెద్దపులిని స్వీకరించారు.
- **1982** : బహుభాషావేత్త, జాతీయవాది, రచయిత, పాత్రికేయుడు పురిపండా అప్పలస్వామి మరణం (జ.1904).


వి. శాంతారాం


క్రిస్టోఫర్ కొలంబస్


మహీంద రాజపక్స


నీల్స్ బోర్


పెద్దపులిని


పుష్ బటన్ టెలిఫోన్ సేవలు


పురిపండా అప్పలస్వామి

## ఎట్టకేలకు 'ఎమర్జెన్సీ' విడుదల ఖరారు.. ఎప్పుడంటే!

కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'ఎమర్జెన్సీ'. ఎట్టకేలకు దీని విడుదల తేదీ ఖరారైంది.



స్వీయ దర్శకత్వంలో కంగనా రనౌత్ నటించిన చిత్రం 'ఎమర్జెన్సీ' దీని విడుదల ఎన్నోసార్లు చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు తాజాగా ఈ చిత్రం విడుదల తేదీని ఖరారు చేశారు. వచ్చే ఏడాది జనవరి 17న ఈ చిత్రం ప్రేక్షకుల ప్రచార చిత్రాలు విడుదలైన క్షణం నుంచే విమర్శలు ఎదుర్కొన్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయి కూడా ఏడాది అవుతోంది. సెన్సార్ విషయంలో ఆలస్యం కావడంతో దీన్ని ఇప్పటివరకు పలుమార్లు వాయిదా వేస్తూ వచ్చారు. చిత్రంలో తమని తక్కువ చేసి చూపించారని.. విడుదలను అడ్డుకోవాలని ఒక వర్గం మధ్యప్రదేశ్ న్యాయస్థానాన్ని సంప్రదించింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. వారి వాదనలను పరిగణలోకి తీసుకోవాలని సెన్సార్ బోర్డుకు సూచించింది. అలాగే సెన్సార్ బోర్డు సూచనలకు నిర్మాణసంస్థ కూడా అంగీకరించడంతో దీని సమస్యలు కొలిక్కి వచ్చాయి. దీంతో ఈ సినిమా విడుదలకు చిక్కుముడులు తొలగాయి. వచ్చే ఏడాది జనవరి 17న ఈ చిత్రం రిలీజ్ కానున్నట్లు తాజాగా కంగనా తెలిపారు. భారతదేశంలో శక్తిమంతమైన మహిళ చరిత్ర, దేశ విధిని మార్చిన క్షణాలు మీ ముందుకు రానున్నాయి అంటూ ఆమె ఓ పోస్టర్ను పంచుకున్నారు.మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితం ఆధారంగా 'ఎమర్జెన్సీ' తెరకెక్కింది. కంగన ఈ విషయంపై హత్య బెదిరింపులు కూడా ఎదుర్కొన్నారు. భారతదేశంలో చీకటి రోజులుగా పిలిచే ఎమర్జెన్సీ నాటి పరిస్థితులను ఈ చిత్రంలో చూపించారు. ఇందులో కంగన.. ఇందిరాగాంధీ పాత్రలో కనిపించనున్నారు. ఆమె స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి నిర్మాతగానూ వ్యవహరించారు. అనుపమ్ ఖేర్, మహిమా చౌదరి కీలకపాత్రలు పోషించారు.

## ఇది నిజంగానే వైల్డ్ఫైర్.. 'పుష్ప2' ట్రైలర్పై ప్రముఖుల ప్రశంస.. బన్నీ రిప్లై

'పుష్ప2' ట్రైలర్పై ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రతి ఫ్రేమ్లో అల్లు అర్జున్, సుకుమార్ల కష్టం కనిపిస్తుందంటూ పోస్టు పెడుతున్నారు..



ప్రస్తుతం సోషల్ మీడియాలో పుష్పగాడి రూల్ నడుస్తోంది. ఎక్కడ చూసినా పుష్ప2 ట్రైలర్ లోని అంశాల గురించే మాట్లాడుకుంటున్నారు. భారీ అంచనాల మధ్య విడుదలైన 'పుష్ప 2: ది రూల్' ట్రైలర్ వాటిని అందుకొని మంచి వ్యూస్తో ట్రెండ్ అవుతోంది. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటిస్తోన్న ఈ చిత్ర ట్రైలర్పై ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు 'ఇది నిజంగానే వైల్డ్ ఫైర్' అంటూ పోస్టు పెడుతున్నారు. వారందరికీ పేరుపేరునా అల్లు అర్జున్ థ్యాంక్స్ చెబుతున్నారు. ఇక బన్నీ సరసన శ్రీవల్లిగా రష్మిక కనిపించనున్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతోంది. ట్రైలర్లోని మాస్ ఎలిమెంట్స్ అదిరిపోయాయి. మరో బ్లాక్బస్టర్ సిద్ధమవుతోంది.. చిత్రబృందానికి అభినందనలు రిషబ్శెట్టి ప్రతి ఫ్రేమ్ మీ కృషిని తెలియజేస్తుంది. పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్ తపన కనపడుతోంది. మీరు దీనికోసం పడిన కష్టం. మీ శ్రమ.. దీని కోసం వెచ్చించిన సమయం అన్నీ సినిమాపై మీకున్న ప్రేమకు స్పష్టమైన సాక్ష్యాలు. హ్యాట్సాఫ్ డియర్ అల్లు అర్జున్ హరీశ్ శంకర్ ఇది నిజంగానే వైల్డ్ఫైర్. అల్లు అర్జున్, సుకుమార్లు మరోసారి మేజిక్ చేయడానికి సిద్ధమయ్యారు. ఇది పవర్ ప్యాక్ట్ ట్రైలర్. బిగ్ స్క్రీన్పై సినిమా చూసేందుకు వేచిచూస్తున్నా అనిల్ రావిపూడి తిరుగుబాటును విప్లవంగా మార్చిన వ్యక్తి తిరిగి వచ్చాడు. అప్పటికంటే ఎక్కువ బిగ్గరగా, ఉగ్రంగా, ఘోరంగా ఉన్నాడు. ఈ పవర్ హౌస్ కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. డిసెంబర్ 5 కోసం ఎదురుచూస్తున్నాప్రశాంత్ వర్మ ఇప్పుడు చెప్పండ్రా అబ్బాయిలు.. నేషనల్ అనుకుంటారా, ఇంటర్నేషనల్ అనుకుంటారా..- దర్శకుడు బుచ్చిబాబు 'పుష్ప2' ట్రైలర్ ఓ బ్లాక్బస్టర్. ఐకాన్స్టార్ ఈ చిత్రం కోసం ఎంత కష్టపడ్డారో తెలుస్తోంది. ప్రతి ఫ్రేమ్లోనూ సుకుమార్ సర్ ప్రతిభ కనపడుతోంది. టీమ్కు నా శుభాకాంక్షలు - బాబీ

## నా అభిప్రాయం ఎందుకు? నేనేమన్నా గొప్ప వ్యక్తినా?: ఛాంపియన్స్ ట్రోఫీపై కపిల్ దేవ్

పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వాల్సిన ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ ఇప్పుడు డోలాయమానంలో పడింది. భారత్ లేదా దక్షిణాఫ్రికా వేదికగా టోర్నీ నిర్వహించేందుకు ఐసీసీ సిద్ధమవుతోందనే వార్తలూ వచ్చాయి.



ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై బీసీసీఐ, పీసీబీ, ఐసీసీల మధ్య దోబూచులాట కొనసాగుతోంది. పాక్లో నిర్వహిస్తే జట్టును పంపేదే లేదని బీసీసీఐ స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. హైబ్రిడ్ మోడల్లో నిర్వహణకు అంగీకరించాలని పాక్ క్రికెట్ బోర్డును ఐసీసీ కోరింది. అయినా, పాక్ బెట్టు వీడటం లేదు. ఈక్రమంలో మాజీ క్రికెటర్లు ఎవరికి వారు తమకు తోచినవిధంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజాగా ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ స్పందించాడు. "ఇప్పుడు బాధ్యతంతా ప్రభుత్వాలపైనే ఉంది. మనలాంటివాళ్లం అభిప్రాయాలను ఇవ్వకూడదు. మనం చెప్పే మాటలు అస్సలు పరిగణనలోకే తీసుకోరు. కపిల్ దేవ్ అందరికంటే పెద్ద వ్యక్తేమీ కాదుగా" అని కపిల్ వ్యాఖ్యానించాడు. రెండు రోజుల కిందటే ఛాంపియన్స్ ట్రోఫీ ప్రపంచ పర్యటనకు సిద్ధం చేస్తున్నట్లు ఐసీసీ ప్రకటించింది. ఇస్లామాబాద్ వేదికగా ప్రారంభించనుంది. కానీ, పీసీబీ మాత్రం పీఓకే ప్రాంతాల్లోనూ ట్రోఫీని ప్రదర్శించాలని భావించింది. కానీ, ఐసీసీ దృష్టికి బీసీసీఐ ఈ విషయాన్ని తీసుకెళ్లింది. దీంతో పీసీబీకి చెక్ పెడుతూ ఐసీసీ ట్రోఫీ పర్యటనను రద్దు చేసేసింది.షెడ్యూల్ ప్రకటన ఎప్పుడు? ఛాంపియన్స్ ట్రోఫీపై ఐసీసీ ఎటూ అడుగు వే-యలేకపోతోంది. ఇప్పటికే షెడ్యూల్ను ప్రకటించాల్సి ఉంది. కానీ, ఎలా నిర్వహిస్తారనే దానిపై స్పష్టత లేకపోవడంతో షెడ్యూల్ ప్రకటన ఆలస్యమవుతోందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. హైబ్రిడ్ మోడల్కు పాక్ అంగీకారం తెలిపితే.. వెంటనే షెడ్యూల్ను విడుదల చేయనుంది. ముసాయిదా షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి నుంచి మార్చి వరకు టోర్నీ జరగనుంది. భారత్లో వచ్చే ఏడాది జనవరి 15 నుంచి 26 వరకు ట్రోఫీ ప్రదర్శన ఉంటుంది. జనవరి 27న పాకిస్థాన్లో అఫీషియల్ కార్యక్రమం ఉండే అవకాశం ఉంది. అయితే, ఆతిథ్య దేశం విషయంలో ఐసీసీ ఏదైనా మార్పులు తీసుకుంటే మాత్రం ట్రోఫీ ప్రదర్శన షెడ్యూల్ కూడా మారనుంది.

## ఫ్యాషన్

వింటర్ సీజన్ ప్రారంభమైంది. రోజు రోజుకి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. చలిగాలులు, పొడి వాతావరణం కారణంగా చాలా మంది అనారోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. ఇక, వీటికి చెక్ పెట్టడానికి చాలా మంది ఉన్ని బట్టలు ధరిస్తారు. చలిగాలుల నుంచి శరీరాన్ని రక్షించుకోవాడానికి స్వెట్టర్లు, మఫ్లర్లు, ఉన్ని దుస్తులు ఎక్కువగా ఉపయోగిస్తారు. అయితే, చాలా రోజుల పాటు మనం స్వెటర్లతో పాటు మిగతా ఉన్ని దుస్తుల్ని వాడం. కేవలం చలికాలంలో మాత్రమే ఉపయోగిస్తాం.అందుకే ఉన్ని దుస్తుల్ని ధరించడమే కాదు.. వాటిని జాగ్రత్తగా ఉంచుకోవాలి. కొందరు ఎలా పడితే అలా ఉతికేస్తారు. దీంతో.. ఉన్ని దుస్తులు పాడైపోతాయి. ఉన్ని దుస్తుల్ని సరిగ్గా వాష్ చేయకపోయినా.. ఆరబెట్టకపోయినా పాడయ్యే ప్రమాదముంది. అంతేకాకుండా.. చల్లటి వాతావరణానికి వాటిలో బ్యాక్టీరియా చేరే ప్రమాదముంది. అందుకే వీటిని ఉతికేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. ఈ రోజుల్లో చాలా మంది వాషింగ్ మెషిన్లు ఉపయోగిస్తున్నారు. వాషింగ్ మెషిన్లో ఉతికేటప్పుడు కొన్ని చిట్కాలు పాటించాలి. ఈ చిట్కాలతో ఉన్ని దుస్తులు ఎక్కువ కాలం మన్నేలా ఉంటాయి. అంతేకాకుండా స్వెటర్లు, ఉన్ని దుస్తులు క్లీన్గా, ఫ్రెష్గా ఉంటాయి.




## చలికాలంలో స్వెటర్లను ఇలా ఉతకండి.. ఎలా పడితే అలా ఉతికితే పాడైపోతాయి..





### సపరేట్‌గా ఉతకండి..



ఉన్ని దుస్తులను మిగతా బట్టలతో కలిపి ఉతకకండి. వీటిని సపరేట్ చేసి వాష్ చేయాలి. చాలా వాషింగ్ మెషిన్లలో ఉన్ని దుస్తుల కోసం స్పెషల్ సెట్టింగ్ ఉంటుంది. ఈ ఆప్షన్ సెలెక్ట్ చేసుకుని ఉతికితే.. ఉన్ని దుస్తులకు ఎటువంటి డ్యామేజ్ జరగదు. మిగతా దు-స్తులతో కలిపి ఉతికితే.. వాటి ఫ్యాబ్రిక్ చెడిపోయే అవకాశం ఉంది. అందుకే ఉన్ని దుస్తుల్ని సపరేటుగా ఉతకాలని నిపుణులు చెబుతున్నారు.

### ఉన్ని దుస్తుల లేబుల్స్ చెక్ చేయండి..



స్వెటర్లు, మఫ్లర్లు, ఉన్ని దుస్తులు ఉతికేటప్పుడు వాటి లేబుల్స్ చెక్ చేయండి. లేబుల్‌పై ఉన్న సూచనలు జాగ్రత్తగా తీసుకోండి. ఉన్ని దుస్తులు ఉతకాల్సిన ఉష్ణోగ్రత, సెట్టింగ్, ఎలా ఉతకాలో ఈ లేబుల్స్ మీద ఉంటుంది. లేబుల్స్‌పై ఉన్న టిప్స్ ఫాలో అయితే.. దుస్తులు క్వాలిటీగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

### సరైన డిటర్జెంట్..



ఉన్ని దుస్తుల్ని వాష్ చేసేటప్పుడు సరైన డిటర్జంట్‌ను ఎంచుకోండి. లిక్విడ్ డిటర్జెంట్ అయితే బెస్ట్ ఆప్షన్. ఎందుకంటే ఉన్ని దుస్తులు చాలా మృదువుగా ఉంటాయి. లిక్విడ్ డిటర్జెంట్‌లో చాలా మృదువైన రసాయనాలు ఉంటాయి. అందుకే.. ఉన్ని దుస్తులను వాష్ చేయడానికి లిక్విడ్ డిటర్జెంట్ బెస్ట్ అంటున్నారు నిపుణులు.

### మరకల్ని ఇలా తొలగించండి..



ఉన్ని దుస్తుల మీద మరకలు ఏర్పడితే.. వాటిని డైరెక్ట్‌గా వాషింగ్ మెషిన్‌లో ఉపయోగించకూడదు. వాషింగ్ మెషిన్‌లో వేయడానికి ముందు.. సాఫ్ట్ స్టెయిన్ రిమూవర్‌తో మరకల్ని తొలగించాలి. తేలికపాటి లిక్విడ్ డిటర్జెంట్, నిమ్మ రసం వంటి వాటిని అప్లై చేసి.. స్టెయిన్ రిమూవర్‌తో మరకల్ని తొలగించడం బెస్ట్ ఆప్షన్. ఆ తర్వాత మరకలు తొలగిన తర్వాత వాష్ మెషిన్‌లో వేసి బట్టలు ఉతకవచ్చు.

### ఈ జాగ్రత్తలు కూడా ముఖ్యం..



వాషింగ్ మెషీన్‌లో ఉన్ని దుస్తుల్ని హై స్పీడ్‌తో వాష్ చేయకూడదు. తక్కువ స్పీడ్‌తో వాష్ చేయాలి. ఎక్కువ స్పీడ్ అయితే.. వాటి ఫ్యాబ్రిక్ చెడిపోయే ప్రమాదముంది.

బట్టలు వాష్ చేసిన తర్వాత తేలికపాటి సూర్య రశ్మి ఉన్న ప్రాంతాల్లో ఆరబెట్టాలి. ఉన్ని బట్టలు పూర్తిగా ఆరిపోయిన తర్వాతే.. వాటిని స్టోర్ చేయాలి.

ఉన్ని బట్టల్ని ఐరన్ చేయాలంటే కూడా జాగ్రత్తలు పాటించాలి. సాధారణ ఐరన్ చేయకూడదు. ఆవిరి ఐరన్ అయితే బెస్ట్ ఆప్షన్.

అంతేకాకుండా వాషింగ్‌మెషిన్‌ను ఎక్కువ బట్టలతో ఉన్ని దుస్తుల్ని తేమ ఉన్న ప్రాంతాల్లో స్టోర్ చేయకండి. పొడిగా ఉన్న ప్రాంతాల్లో స్టోర్ చేయాలంటున్నారు నిపుణులు.

గమనిక.. ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం.